






# దీపికా మరోసారి అమ్మ

బాలీవుడ్ ప్రముఖ జంట దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ ఇంట్లో మళ్లీ పండగ వాతావరణం నెలకొంది. ఈ స్టార్ దంపతులు రెండోసారి తల్లిదండ్రులయ్యారు. దీపికా మరోసారి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు అధికారికంగా ప్రకటించడంతో నెట్టింట శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. గత కొద్దిరోజులుగా దీపికా డెలివరీ సమయం, ఆసుపత్రి చేరికపై రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. వీటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెడుతూ, ఇన్‌స్టాగ్రామ్‌లో రణ్‌వీర్--దీపిక సంయుక్తంగా ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. "వెల్‌కమ్ బేబీ గర్ల్.. 19-9-2026 - దువా, దీపిక, రణ్‌వీర్" చిన్నారి పాదముద్రలతో కూడిన కార్డును పోస్ట్ చేస్తూ, కేవలం దిష్టి తగలకుండా ఉండే 'ఈవిల్ ఐ' ఎమోజీని క్యాప్షన్‌గా జోడించారు.

ఈ వార్తలో నెటిజన్లను, సినీ వర్గాలను ఎక్కువగా ఆకర్షిస్తున్న అంశం ఏంటంటే -- ప్రసవానికి కేవలం ఒక్క రోజు ముందే ఈ జంట ముంబైలోని ప్రఖ్యాత సిద్ధివినాయక ఆలయాన్ని దర్శించుకోవడం. ఆ సమయంలో కెమెరాల కంటికి చిక్కకుండా అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య వీరు పూజలు నిర్వహించడంపై బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. వ్యక్తిగత జీవితాన్ని, ప్రెగ్నెన్సీ ప్రయాణాన్ని ప్రచారార్భాటం లేకుండా అత్యంత గోప్యంగా ఉంచే విషయంలో ఈ జంట వ్యవహరించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే వీరికి 'దువా' అనే కుమార్తె ఉండగా, ఇప్పుడు మరో చిన్నారి రాకతో తమ కుటుంబం ముగ్గురి నుంచి నలుగురికి చేరిందని ఈ జంట ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దీపికా, చిన్నారి ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు సమాచారం. ఆలియా భట్, కత్రినా కైఫ్, కరణ్ జోహార్ సహా పలువురు చిత్ర ప్రముఖులు, అభిమానులు ఈ స్టార్ కపుల్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

# కదిరి కాళిదాస్‌గా చిరు

మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న మూవీ 'కాకా'. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' సూపర్ హిట్ సాధించడంతో ఈ కొత్త చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి చిరంజీవి స్వయంగా ఇచ్చిన కొన్ని హింట్స్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో సంచలనంగా మారాయి.



పైకి కనిపించే రూపం వేరు.. అసలు వెనుక దాగి ఉన్న చరిత్ర వేరంటూ మెగాస్టార్ ఇచ్చిన లీక్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఇటీవల జరిగిన ఓ ఈవెంట్‌లో మాట్లాడిన మెగాస్టార్ చిరంజీవి.. 'కాకా'లో తన పాత్ర పేరు కదిరి కాళిదాస్ అని వెల్లడించారు. ప్రస్తుతం ఇండస్ట్రీ సర్కిల్స్‌లో ప్రచారం అవుతున్న కథనాల ప్రకారం.. ఈ సినిమాలో మెగాబాస్ రెండు భిన్నమైన పార్శ్వాలున్న పాత్రను పోషిస్తున్నారట.

బయటి ప్రపంచానికి ఆయన 'సత్యం'.. ఒక సాధారణ ఆక్వా ఫ్యాక్టరీలో పనిచేసే సూపర్‌వైజర్. చూడ్డానికి అమాయకంగా, బాధ్యతగల సాధారణ పౌరుడిగా కనిపించే ఈ సత్యం వెనుక, చీకటి ప్రపంచాన్ని శాసించే 'కదిరి కాళిదాస్' అనే అండర్‌వరల్డ్ డాన్ ఉన్నాడనే పాయింట్ కథలో ప్రకంపనలు సృష్టించనుందని తెలుస్తోంది. ఈ డ్యూయల్ షేడ్ ట్రాక్ మాస్ ఆడియన్స్‌కు ఫుల్ మీల్స్ పెట్టడం ఖాయం అని అంటున్నారు. భారీ యాక్షన్ సన్నివేశాలు మాత్రమే కాకుండా, ఈ కథకు అసలైన బలం తండ్రీకూతుళ్ల ఎమోషన్ అని తెలుస్తోంది. మలయాళ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ ఇందులో మెగా డాటర్ 'అమ్ములు' పాత్రలో కనిపించనుంది. మెడిసిన్ చదివే కూతురి కోసం ప్రాణమిచ్చే తండ్రిగా చిరంజీవి నటన, వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కంటతడి పెట్టించడం ఖాయం అని అంటున్నారు. అసలు అండర్‌వరల్డ్‌ను శాసించే కదిరి కాళిదాస్, సాధారణ సత్యంగా మారి కూతురి కోసం ఎందుకు బతుకుతున్నాడనే సస్పెన్స్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందట. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ వ్యయంతో ఈ మెగా ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# బిగ్ స్క్రీన్.. బిగ్ ట్రీట్!

హైదరాబాద్‌లోని సినిమా ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ శుభవార్త వచ్చేసింది. నగరంలో గత 12 ఏళ్లుగా సరైన ఐమాక్స్ అనుభూతి లేదనే వెలితిని తీర్చేందుకు ఎట్టకేలకు అద్భుతమైన అవకాశం రాబోతోంది. చారిత్రాత్మక ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఉన్న ఏఎంబీ క్లాసిక్ విక్టరీ ప్రాంగణంలో అత్యాధునిక హంగులతో కూడిన కొత్త ఐమ్యాక్స్ స్క్రీన్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది.

ఈ సరికొత్త ఐమ్యాక్స్ స్క్రీన్ ప్రారంభాన్ని మరింత గ్రాండ్‌గా చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే హాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ విజువల్ వండర్ 'డ్యూన్ పార్ట్ త్రీ' చిత్రాన్ని ఫస్ట్ ఓపెనింగ్ మూవీగా ప్రదర్శించే అవకాశం ఉందనే వార్త సినీ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. అధునాతన లేజర్ ప్రొజెక్షన్ టెక్నాలజీ, అత్యుత్తమ 12-ఛానల్ సౌండ్ సిస్టమ్‌తో రానున్న ఈ స్క్రీన్ సినిమా చూసే అనుభూతినే పూర్తిగా మార్చేయనుంది.

ఇక ఈ సినిమా విశేషాలతో పాటు, టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న పాన్ వరల్డ్ క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' లాంటి భారీ చిత్రాలను ఈ బిగ్ స్క్రీన్‌పై చూస్తే ఆ మ్యాజిక్ వేరే లెవెల్‌లో ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. రాజమౌళి తెరకెక్కించే విజువల్ వండర్స్‌ను ఇలాంటి సరికొత్త ఐమ్యాక్స్ స్క్రీన్‌లపై వీక్షించడం ప్రేక్షకులకు నిజంగా అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది. మొత్తానికి టాలీవుడ్‌తో పాటు హాలీవుడ్ చిత్రాలను కూడా బిగ్ స్క్రీన్‌పై ఎంజాయ్ చేసే రోజులు వచ్చేయడంతో నగర సినీ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.




# అడవిలో మహాదేవ్ వేట!

వర్సటైల్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'సమవర్తి'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక టీజర్‌ను లాంచ్ చేశారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రకృతికి, మానవులకు మధ్య నడిచే సంఘర్షణ, అడవుల అక్రమ నరికివేత, గిరిజనుల జీవన విధానం వంటి సరికొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీజర్ ఆరంభంలో వచ్చే వైవిధ్యమైన వాయిస్ ఓవర్ కథపై ఆసక్తిని కలిగిస్తుంది. ఇక ఈ చిత్రంలో 'మహాదేవ్' అనే వైల్డ్ అండ్ రగ్డ్ పాత్రలో సత్యదేవ్ కనిపించనున్నారు. ఆయన గెటప్, తెలంగాణ యాసలో చెప్పే పవర్‌ఫుల్ డైలాగులు, ముఖ్యంగా టీజర్ ముగింపులో వచ్చే "ఈసారి మిస్ అవ్వదు" అనే డైలాగ్ సినిమాపై హైప్‌ను తారాస్థాయికి చేర్చాయి.




అడవులు, ప్రత్యేకమైన లొకేషన్లలో అత్యంత సహజసిద్ధంగా తెరకెక్కించిన విజువల్స్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చివరిలో చూపించిన పులి ఎంట్రీ సీన్ మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఇందులో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తోంది. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని రుద్ర పిక్చర్స్ మరియు పంచభూత ప్రొడక్షన్స్ సంస్థలు అత్యున్నత నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.

# 'మూకుత్తి అమ్మన్-2'కు బ్రేక్!

లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రం 'మూకుత్తి అమ్మన్-2'. గతంలో తమిళంతో పాటు తెలుగు సినీ ప్రియులను ఎంతగానో అలరించి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించిన 'మూకుత్తి అమ్మన్' (తెలుగులో అమ్మోరు తల్లి)కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సీనియర్ దర్శకుడు సుందర్



సి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నాడు. ఈ ప్రతిష్టాత్మక మూవీ రాబోయే దీపావళి కానుకగా నవంబర్ 6న రిలీజ్ కాబోతున్నట్లు ఇప్పటికే మేకర్స్ అనౌన్స్ చేశారు. అయితే.. ఇప్పుడు ఈ చిత్రం అనుకున్న టైమ్‌కు రాకుండా వాయిదా పడే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు కోలీవుడ్ నుంచి అందుతున్న సమాచారం మేరకు 'మూకుత్తి అమ్మన్-2 VFX (విజువల్ ఎఫెక్ట్స్) విషయంలో ఇంకాస్త దృష్టి పెట్టాలని భావిస్తున్నాడట దర్శకుడు సుందర్ సి. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన VFX పనులను తిరిగి ప్రారంభించినట్లు సమాచారం. అందుకే ఈ చిత్రం 2026 దీపావళి (నవంబర్ 6) నాటికి విడుదలయ్యే అవకాశం లేనట్లు పలు పోస్టులు వైరల్ అవుతుండగా.. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా.. ఈ ప్రతిష్టాత్మక సినిమాను అవ్ని సినిమాస్, వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్, రౌడీ పిక్చర్స్ బ్యానర్లపై నిర్మాత ఇషారి గణేష్ ఎంతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. రెజీనా కాసాండ్రా, స్టార్ కమెడియన్ యోగిబాబు అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు.

# రేసింగ్ ట్రాక్‌పై అజిత్ ఫైర్!

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ సినిమాలతో పాటు మోటార్ రేసింగ్‌పై తనకున్న అంకితభావాన్ని చాటుతూ తెరకెక్కించిన స్పెషల్ డాక్యుమెంటరీ 'గ్లాడియేటర్స్' ట్రైలర్ తాజాగా విడుదలయింది.

రేసింగ్ ట్రాక్‌పై తలపడే వేగం, ఛాలెంజ్‌లను ఎదుర్కొనే గట్స్, తెరవెనుక ఆయన పడిన కష్టం, సవాళ్లు మరియు విజయాలను ఈ డాక్యుమెంటరీ కళ్లకు కట్టనుంది. దర్శకుడు ఎ.ఎల్. విజయ్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, షాలిని అజిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేవలం సినిమాలే కాకుండా ప్రొఫెషనల్ మోటార్ రేసింగ్‌లో అజిత్ సాగిస్తున్న ప్రయాణాన్ని, ఆయన పడే తపనను ఈ డాక్యుమెంటరీ ద్వారా చూపించనున్నారు. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ అజిత్ ఫ్యాన్స్‌తో పాటు సినీ అభిమానులలో భారీ అంచనాలను పెంచేసింది.

